

2

బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదు


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

J V NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక -363 మంగళవారం19 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

**కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం -వారి కృషి అసామాన్యమని మంత్రి అమిత్ షా కితాబు**


**రాయ్‌పూర్,మే 18(జర్నలిస్ట్ వార్త):** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్ లో సోమవారం నాడు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ **మిగతా 2లో..**



# భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే అండగా నిలిచింది: ప్రధాని మోడీ**

**ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య పలు ఒప్పందాలు**



**ఓస్లో: ,మే 18(జర్నలిస్ట్ వార్త):** అత్యంత క్లిష్టసమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, భారతదేశానికి, నార్వే అండగా నిలిచి, తన నిజమైన స్నేహాన్ని చాటుకుందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసించారు. సోమవారం నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన తరువాత, ప్రధాని మోడీ పలు కీలక అంశాలపై మాట్లాడారు. సైనిక ఘర్షణల ద్వారా మాత్రమే శాశ్వత శాంతిని సాధించలేమని ప్రధాని మోడీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని, ఉక్రెయిన్ వివాదాన్ని చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.”భారత్, నార్వే రెండూ కూడా నియమ, నిబంధనలతో కూడిన ప్రపంచ వ్యవస్థను, చర్చలను, దౌత్యాన్ని విశ్వసిస్తాయి. **మిగతా 2లో..**



## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

**సిఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ**

**అమరావతి,, మే 18(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో **మిగతా 2లో..**

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం



**ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్**

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**

**తిరువనంతపురంమే 18(జర్నలిస్ట్ వార్త):** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో **మిగతా 2లో..**



## కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

**సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు**



**న్యూఢిల్లీ, మే 18(జర్నలిస్ట్ వార్త):** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. **మిగతా 2లో..**


## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

**తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం**

**- మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**



2లో.



2లో.

## రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదు

**తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై తెలంగాణ ఓఎంసీల కీలక ప్రకటన**

## బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

**సిరిసిల్లలో బిఆర్ఎస్, బిజెపిల ఘర్షణతో ఉద్రిక్తత**

**రాజన్న సిరిసిల్ల,మే 18(జర్నలిస్ట్ వార్త):):** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు. **మిగతా 2లో..**



# భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

మొదటిపేజీ తరువాయి

కేవలం సైనిక ఘర్షణ ద్వారా మాత్రమే ఏ సమస్యనూ పరిష్కరించలేమని మేము ఇద్దరం భావిస్తున్నాం. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలు వీలైనంత త్వరగా ముగియడానికి, శాంతి స్థాపన కోసం జరిగే ప్రతి ప్రయత్నానికి మేము మా మద్దతును ఇస్తాం." అని మోడీ చెప్పారు.

**అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి**

నాలుగు ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా స్వీడన్ నుంచి నార్వే రాజధాని ఓస్లో చేరుకున్న కొద్ది గంటల్లోనే మోడీ, ఆ దేశ ప్రధాని స్టోర్తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. "పెరుగుతున్న ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. ఈ విషయంలో నేను, నార్వే ప్రధాని ఏకాభిప్రాయంతో ఉన్నాం. అంతేకాదు ఉగ్రవాదాన్ని దాని అన్ని రూపాల్లోనూ సమూలంగా నిర్మూలించడం మన ఉమ్మడి బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు.

**నిజమైన స్నేహం**

గతేడాది పహల్గాంలో హిందూ పురుషులే లక్ష్యంగా జరిగిన పాక్ ప్రేరిపిత ఉగ్రదాడిలో, భారత్కు చెందిన 26 మంది పౌరులు మరణించారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని మోడీ, ఆ క్లిష్ట సమయంలో భారత్కు నార్వే అందించిన మద్దతును కొనియాడారు. "నేను గత ఏడాదే నార్వేలో పర్యటించాల్సి ఉంది. కానీ పహల్గాం ఉగ్రదాడి కారణంగా ఆ పర్యటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నార్వే, భారతదేశానికి అండగా నిలబడి, నిజమైన స్నేహాన్ని చాటుకుంది. ఈ రోజు నేను నార్వేను సందర్శిస్తున్న తరుణంలో, వారు చూపిన సంఘీభావానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను." అని మోడీ తెలిపారు.

**ఇంజనీరింగ్ విభాగాల్లో కీలక ఒప్పందాలు**

ఇటీవల భారత్, ఈయూ మధ్య చారిత్రక ఒప్పందం జరిగిందని, దీని వల్ల భారత్, నార్వేలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయన అన్నారు. "భారత్, నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. నార్వే నుంచి సాంకేతికత, పెట్టుబడులు భారత్కు వస్తున్నాయి. అలాగే వివిధ రంగాల్లో పరిశోధనల కోసం నార్వే నుంచి మేము సాయం తీసుకుంటాం. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు జరిగాయి. ఇస్రో, నార్వే స్పేస్ ఏజెన్సీల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక ఇరుదేశాల మధ్య ఉన్న గ్రీన్ స్ట్రేటజీ వల్ల ప్రపంచ దేశాలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మారిటైమ్ భద్రత విషయంలోనూ మేము నార్వేతో కలిసి పనిచేస్తున్నాం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, యువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు. క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదు

**బండి సంజయ్ లక్ష్యంగా బీఆర్ఎస్ పోస్టర్లు...**

**స్పందించిన బీజేపీ చీఫ్**

**రామచందర్ రావు**

**బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శ**

**వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం సరికాదన్న రామచందర్ రావు**



కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఎలాంటి తప్పుచేయలేదని, కానీ ఆయనపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. బండి సంజయ్, బీజేపీపై రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిని, కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ పైనా, బీజేపీపైనా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి బీఆర్ఎస్ రాష్ట్రమంతా పోస్టర్లు వేయించిందని విమర్శించారు. బండి సంజయ్ కుటుంబ సభ్యులు తప్పు చేస్తే న్యాయపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కానీ బండి సంజయ్‌ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడమేమిటని ప్రశ్నించారు. బండి సంజయ్‌ని కేటీఆర్ లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల కాలంలో మహిళలపై నేరాలు 67 శాతం పెరిగాయని ఆరోపించారు. మహిళలపై జరిగిన అత్యాచారానికి సంబంధించి కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ బాలిక కేసులో లేదా మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్ళినప్పుడు లేదా తనను ఎమ్మెల్యే వేధిస్తున్నారని ఓ మహిళా సర్పంచ్ ఫిర్యాదు చేసినప్పుడు వారు రాజీనామా చేశారా అని నిలదీశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేతకాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ-కార్ రేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు.

# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి



మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టు ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

## ఏపీలో 16,000 ఇ-సైకిళ్లు..

**అమరావతి,మే 18(జర్నలిస్ట్ వార్త);**

రాష్ట్రంలో ఇంధన పొదుపును ప్రోత్సహించడంతో పాటు, పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సాహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ఒక ఉద్యమంగా మార్చాలని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తొలి దశలో 16,000 ఎలక్ట్రిక్ సైకిళ్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల సిబ్బందికి అందించాలని నిర్ణయించారు. సోమవారం నాడు సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ సైకిళ్లు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. కార్యాలయ సిబ్బందికి అందించే 16,000 ఇ–సైకిళ్లను సులభ వాయిదాల (ఈఎంఐ) పద్ధతిలో ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

సామాన్యులు కూడా ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేందుకు వీలుగా రుణాలు అందించేందుకు ఒక ప్రత్యేక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు. వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి సారించాలన్నారు. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కంపెనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై తెలంగాణ ఓఎంసీల కీలక ప్రకటన

### రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని వెల్లడి

**మే 18(జర్నలిస్ట్ వార్త);**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరతపై రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) కీలక ప్రకటన చేశాయి. రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని తెలంగాణ రాష్ట్రంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు వెల్లడించాయి. సరఫరాను ఓఎంసీలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ తెలిపారు. రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు చమురురంగ కంపెనీలు తెలిపాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహ అవసరాల ఎల్పీజీ సిలిండర్ల బుకింగులు తగ్గుముఖం పట్టినట్లు వెల్లడించాయి. వినియోగదారులు ఆందోళనతో ముందస్తు బుకింగ్స్ చేసుకోవద్దని కోరాయి. ఈ నెలలో 17వ తేదీ వరకు మొత్తం 20.06 లక్షల ఎల్పీజీ సిలిండర్లను డెలివరీ చేసినట్లు వెల్లడించాయి.

ఈ సీజన్‌కు ఇది సాధారణమేనని, ఎస్సెమ్మెస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని ఎల్పీజీ వినియోగదారులను కంపెనీలు ప్రోత్సహించాయి. సిలిండర్ల సరఫరాలో అక్రమాలను అరికట్టడానికి, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత సిలిండర్ డెలివరీ అథెంటికేషన్ కోడ్ వ్యవస్థను అనుసరించాలని సూచిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో ఈ విధానం 95 శాతం అమలవుతున్నట్లు తెలిపాయి.

## బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

మొదటిపేజీ తరువాయి

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బు÷-లలెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్‌కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్‌లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ఎ÷-లాంట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ఎ÷-లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళ ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ త్వరలో 'ఫ్లైయింగ్ ఫ్లీ అ6' పేరుతో ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

మొదటిపేజీ తరువాయి

చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

### తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం - మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,ఎమే 18(జర్నలిస్ట్ వార్త);** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నె÷-లకెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు,




పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
మంగళవారం19 మే 2026

# టీటీడీ బధిర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## మే 15 నుంచి జూన్ 22 వరకు స్వీకరణ

**హనుమకొండ, బ్యూరో మే 18 (జర్నలిస్ట్ వార్త):ం**



చెవుడు, మూగ విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే చెవుడు, మూగ విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాల కోసం మే 15 నుంచి జూన్ 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సదరం సర్టిఫికేట్, యూడీఐడీ కార్డు, ఆధార్ కార్డు, కులం-ఆదాయ ధృవపత్రాలు, రేషన్ కార్డు, నాలుగు ఫొటోలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.పాఠశాల చిరునామా: శ్రీ వెంకటేశ్వర బధిరుల ఉన్నత పాఠశాల, మున్సిపల్ గార్డెన్ లైన్, ప్రగతి నగర్ కాలనీ ఫేజ్-2, ఎన్ఐటీ పోస్టు, వరంగల్ అర్బన్ 506004.మరిన్ని వివరాలకు 9440739423, 8801117608, 9866673486 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# భూ పట్టాల్లో కులవివక్ష వద్దు

## అర్హులైన పేదలకూ పట్టాలు ఇవ్వాలి

### తెలంగాణ భూ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు డిమాండ్



**ఎల్కతుర్తి, మే 18 (జర్నలిస్ట్ వార్త):** మండలంలో భూ పట్టాల మంజూరులో కులవివక్ష ప్రదర్శిస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలంగాణ భూ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలో డబ్బు, అధికార యంత్రాంగం అండ ఉన్న నాయకులకే భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని, పేదలకు సంబంధించిన సాదా బైనామాలు, పట్టాల సమస్యలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయని విమర్శించారు.హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేట గ్రామానికి చెందిన బందేల అనసూయ కుటుంబం గత 40 ఏళ్లుగా సర్వే నంబర్ 432లో ఒక ఎకరం భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోందన్నారు. ఆ భూమిని బందేల రాజేందర్ పేరిట పట్టా చేయాలని పలుమార్లు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కనీసం భూమి పరిశీలనకు కూడా అధికారులు రాకపోవడం దారుణమన్నారు. పేదల సమస్యలను పట్టించుకోకుండా కులవివక్ష, డబ్బు ప్రభావంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, అర్హులైన పేదలకు భూ పట్టాలు మంజూరు చేయాలని గడ్డం రఘు డిమాండ్ చేశారు

# మే 18 నుంచి 23 వరకు పర్యాటక వారోత్సవాలు

## పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్




**ఖమ్మం, మే 18 (జర్నలిస్ట్ వార్త):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పర్యాటక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ, మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యూట్యూబ్ వీడియో ప్రెజెంటేషన్ చేసిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా టూరిజం సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మే 22న నేలకొండపల్లి బుద్ధ స్థూపం వద్ద స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, యువతలో పర్యాటక చైతన్యం పెంపొందించడం ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.



**బయ్యారం/,మే 18.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండలంలో నామలపాడులోని పోలీస్ చెక్ పోస్ట్ ను,మండల కేంద్రంలోని సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం నిల్వలపై,రవాణా విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.కాంటాలు నిర్వహించిన ధాన్యాన్ని సత్వరమే లారీలు,ట్రాక్టర్ల ద్వారా గిడ్డంగులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.కాంటాలు నిర్వహించిన ధాన్యం స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు.రైతులు కాంటాలు నిర్వహించిన ధాన్యం బయటికి తరలించడంలో వాహనాల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.మరిన్ని వాహనాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని ఎస్పి సొసైటీ సిబ్బందిని ఆదేశించారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలింపులో రైతులకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలని సిఐ రవీందర్,ఎస్ఐ ప్రశాంత్ బాబును ఎస్పి ఆదేశించారు. కొనుగోలు కేంద్రం సిఈవో పనితీరు,ధాన్యం తరలింపుపై నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు,తహసీల్దార్ నాగరాజు,సిఐ రవీందర్,సొసైటీ సీఈవో సురేందర్,ఆర్ఐ ఉపేందర్, సొసైటీ సిబ్బంది సతీష్,గణేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కుల సంఘాల భవనాలకు ఎస్డీఎఫ్ వరాలు





## రూ.1.18 కోట్ల మంజూరు పత్రాల పంపిణీ


**హన్మకొండ, బ్యూరో మే 18 (జర్నలిస్ట్ వార్త):**


ధర్మసాగర్, వేలేరు, ఐనవోలు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.1 కోటి 18 లక్షల 70 వేల విలువైన మంజూరు పత్రాలను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం పంపిణీ చేశారు. హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాల కుల సంఘాల ప్రతినిధులకు ఈ పత్రాలు అందజేశారు.వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, మల్లికుదుర్ల గ్రామంలో యాదవ కమ్యూనిటీ హాల్ పూర్తి పనులకు రూ.5 లక్షలు, ముస్లిం స్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. వేలేరు మండల కేంద్రంలోని మజీద్ ప్రహరీ గోడ నిర్మాణానికి మరో రూ.5 లక్షలు కేటాయించారు.ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలో వాగుపై తాత్కాలిక కట్ట నిర్మాణానికి రూ.7.50 లక్షలు, కస్తూరిబా గాంధీ పాఠశాల సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.16.30 లక్షలు మంజూరు చేశారు. మల్లక్‌పల్లి గ్రామంలో ముదిరాజ్, అరే, ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు తలా రూ.5 లక్షలు చొప్పున కేటాయించగా, స్మశానవాటికలో ఆఫీస్ రూమ్, వెయిటింగ్ రూమ్, టాయిలెట్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఎల్కుర్తి గ్రామంలో మహిళా కమ్యూనిటీ హాల్ పూర్తి పనులకు రూ.10 లక్షలు కేటాయించారు.అదేవిధంగా ఐనవోలు మండలంలోని గర్నేపల్లి గ్రామంలో మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, వెంకటాపూర్ గ్రామంలో అరే కమ్యూనిటీ హాల్ పూర్తి పనులకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా కమిటీ ఎన్నికలు

## అధ్యక్షుడిగా కేశవమూర్తి.. కార్యదర్శిగా సాయిరాం ఘన విజయం

**హనుమకొండ, బ్యూరో మే 18(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) హనుమకొండ జిల్లా నూతన కమిటీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటీ జరగ్గా మిగతా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల ఫలితాలను ఆర్వో కంకణాల సంతోష్ అధికారికంగా ప్రకటించారు.జిల్లా అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి ఘన విజయం సాధించారు. ఆయనకు 208 ఓట్లు లభించగా, ప్రత్యర్థి గుంటి విద్యాసాగర్‌కు కేవలం 4 ఓట్లు మాత్రమే వచ్చాయి. 5 ఓట్లు చెల్లనివిగా తేలాయి. దీంతో కేశవమూర్తి 204 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు.ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన ఊటుకూరి సీతారామారావు (సాయిరాం)కు 204 ఓట్లు లభించగా, ప్రత్యర్థి మెరుగు రాజేంద్రప్రసాద్‌కు 7 ఓట్లు వచ్చాయి. 6 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. దీంతో




సాయిరాం 197 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం 407 ఓట్లకు గాను 217 ఓట్లు పోలయ్యాయి.

**కొత్త కమిటీ సభ్యులు**

**కోశాధికారి**-పొడిశెట్టి విష్ణువర్ధన్

**ఉపాధ్యక్షులు**

-దండు మోహన్,ఇమ్మడి ప్రసాద్

-గునిశెట్టి విజయభాస్కర్,అల్లె రామారావు

**సహాయ కార్యదర్శులు:**

జి. బాలరాజు,గన్ను సంతోష్‌కుమార్ ,బోయిని భిక్షపతి,ఎండీ ఖాదర్ పాష

**కార్యవర్గ సభ్యులు:**

డి. రాధాకృష్ణ, జి. రామానుజం, ఆర్వీ దామోదర్, పి. ప్రదీప్‌రాజ్, ఎండీ జమాలొద్దిన్, ఎ. సాంబశివరాజు, ఎండీ ఉస్మాన్‌పాష, ఎండీ ఫజర్ ఉర్ రహమాన్, ఎ. విష్ణువర్ధన్‌రాజు, ఆర్. శ్రీధర్, ఎం. ఓదెలు, ఓదెల శివకుమార్, కొట్టె సుధాకర్, పులికంటి రాజేందర్, ఎం. సంతోష్‌కుమార్, ఇ. జగన్, ఏ. కొమ్మాలు ఎన్నికైనట్లు ప్రకటించారు.

**ఎన్నికల అధికారులకు అభినందనలు**

జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని ఎన్నికల అధికారి కంకణాల సంతోష్ ఆకాంక్షించారు. కొత్త కమిటీ సభ్యులకు పలువురు సీనియర్ జర్నలిస్టులు, పాత్రికేయ మిత్రులు అభినందనలు తెలిపారు.

రెండు రోజుల పాటు ఎన్నికల ప్రక్రియను సమర్థంగా నిర్వహించిన ఆర్వో కంకణాల సంతోష్‌తో పాటు అబ్జర్వర్లుగా వ్యవహరించిన గాడిపెల్లి మధు, పీవీ మదన్‌మోహన్, పిన్నా శివకుమార్, వల్లాల వెంకటరమణ, పెండెం వేణుమాధవ్‌లను రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ అభినందించారు.

# ఎల్కతుర్తిలో 2కే వాకథాన్ నిర్వహణ

## నడక, యోగతో ఆరోగ్యంగా ఉంటాం : ఎంపీడీవో విజయ్ కుమార్

**ఎల్కతుర్తి, /మే 18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నిర్వహించిన 2కే వాకథాన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయ్ కుమార్, మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ నడక చేయడం వల్ల శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి రోజుకు కనీసం వెయ్యి అడుగులు నడవాలని సూచించారు. యోగ సాధన ద్వారా శరీరం, మనసు, ఆత్మ సమతుల్యంగా ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, మండల విద్యాధికారి



చదువుల సత్యనారాయణ, ఈఓఆర్డీ రవి, వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





**యోగా గురువుకు ఘన సన్మానం**

మండల కేంద్రానికి చెందిన యోగా గురువు శీలం అనిల్ కుమార్‌ను స్థానిక సీఐ పులి రమేష్, ఎస్సై నరసింహారావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ లావణ్య, ఈఓఆర్డీ రవి, మాజీ ఏఎస్ఐ సంపత్, డాక్టర్ రమేష్ బాబు, మద్రి రవికుమార్ తదితరులు ఘనంగా సన్మానించారు. యోగా సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు.

# సహకార సంఘాలపై అందరి చూపు

## కొత్త పాలకవర్గాల కోసం ఆశావహుల ఎదురుచూపు -పార్టీ పెద్దల చుట్టూ నాయకుల ప్రదక్షిణలు

**ఎల్కతుర్తి, మే 18 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని సహకార సంఘాల్లో కొత్త పాలకవర్గాల నియామకంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ఆశావహులు పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అధికార పార్టీకి చెందిన నాయకులు ఇప్పటికే నామినేటెడ్ పదవుల కోసం పావులు కదుపుతున్నారని సమాచారం.మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు బలంగా ఉన్నప్పటికీ ఎన్నికలు నిర్వహిస్తే పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానిక నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే పోటీలు లేకుండానే నేరుగా నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని కొందరు యువ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కోర్టు ఆదేశాల నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు మళ్లీ సహకార సంఘాల్లో బాధ్యతలు చేపట్టడం అధికార పార్టీ వర్గాల్లో




చర్చనీయాంశంగా మారింది. సహకార సంఘాలపై తిరిగి పట్టు సాధించేందుకు అధికార పార్టీ నాయకులు మంత్రులు, ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.సహకార సంఘాల్లో గ్రామాల వారీగా ప్రాతినిధ్యం కల్పించే దిశగా కమిటీలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో రెండు గ్రామాలకు ఒక డైరెక్టర్ చొప్పున క్లస్టర్ విధానంలో పదవుల కేటాయింపుపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సుమారు 20 గ్రామాలకు 12 నుంచి 14 డైరెక్టర్ పదవులు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని నాయకులు చెబుతున్నారు.మరోవైపు సహకార సంఘాల అభివృద్ధి కూడా గణనీయంగా పెరుగుతోందని సీనియర్ డైరెక్టర్లు పేర్కొంటున్నారు. పంట రుణాలు, వడ్ల కొనుగోలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా, తాగునీటి ప్లాంట్ల నిర్వహణ వంటి కార్యకలాపాల ద్వారా సంఘాల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. సభ్యుల సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సహకార సంఘాలు రైతులకు మరింత చేరువవుతున్నాయని చెప్పారు.

జూన్, జూలై నెలల్లో కొత్త పాలకవర్గాల నియామక ప్రక్రియ చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం






సాగుతోంది. సహకార సంఘాలకు త్వరలోనే కొత్త పదవులను ప్రభుత్వం ప్రకటించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# ముప్పారం, నారాయణగిరిలో పండుగ వాతావరణం

**ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం.. 108 మందికి మంజూరు పత్రాల పంపిణీ**

**రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇళ్లు కడియం శ్రీహరి -అభివృద్ధిలో స్టేషన్ ఘనపూర్ దూసుకుపోతోంది ఎంపీ కడియం కావ్య**







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మే 18 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని, పేద ప్రజలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండలం ముప్పారం, నారాయణగిరి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం, సీసీ రోడ్ల ప్రారంభ కార్యక్రమాల్లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పారం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు, నారాయణగిరిలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు, రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ముప్పారం(64), నారాయణగిరి(40), సోమదేవరపల్లి(4) గ్రామాలకు చెందిన మొత్తం 108 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే ముప్పారం గ్రామంలో గౌడ, కురుమ కమ్యూనిటీ హాళ్లు, నారాయణగిరిలో ముదిరాజ్, మహిళా కమ్యూనిటీ హాళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషితో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు రూ.3 కోట్ల చొప్పున అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. తన ఎంపీ నిధుల నుంచి రూ.3.5 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తోందన్నారు.
ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న పేదలకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక సర్వే నిర్వహించి అర్హులను గుర్తిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, తన పాలనలో అవినీతికి తావు ఉండదని స్పష్టం చేశారు. 32 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరితోనూ ఒక్క రూపాయి తీసుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, ఒక్కో నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతోందన్నారు. నారాయణగిరి జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలను తెలంగాణ మాడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నారాయణగిరి సర్పంచ్ పుట్ట రేణుక, ముప్పారం సర్పంచ్ గుంటిపల్లి రేణుక, హౌసింగ్ పీడీ సిద్ధార్థ్ నాయక్, పీఆర్ ఈఈ సైదులు రెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల మోతతో సామాన్యుడిపై భారాలు

**ఎల్కతుర్తిలో సీపీఐ వినూత్న నిరసన**



**ఎల్కతుర్తి,/ మే 18 (జర్నలిస్ట్ వార్త):** పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెరుగుతున్న ఇంధన ధరలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నాయకులు ప్రచారం చేపట్టారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగి సామాన్యుడి నడ్డి విరిగే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్, గ్యాస్, సిఎన్‌జీ ధరలు పెంచబోమని ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారని, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం ప్రజలను మోసం చేసినట్టేనని మండిపడ్డారు. ప్రజలపై అదనపు భారం మోపకుండా వెంటనే ఇంధన ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శి మర్రి విజయ్, తండముండయ్య, చంద్రమౌళి, మోహన్‌రెడ్డి, సర్పంచ్ కర్రె లక్ష్మి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం చెరువులో పూడిక తొలగింపు పనులు ప్రారంభం

**కొబ్బరికాయ కొట్టి పూడికతీత పనులు ప్రారంభించిన ఇంచార్జ్ సర్పంచ్**







**భీమదేవరపల్లి/మే18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని మంగళవారం ఎం.ఐ. ట్యాంక్ (చెరువు)లో పూడిక తొలగింపు (డీసిల్టింగ్) పనులు ఉపాధి హామీ పనులలో భాగంగా ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో సుమారు రెండు వందల మంది ఉపాధి కూలీలు పాల్గొని పనులు చేస్తున్నారు. ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ కొబ్బరికాయ కొట్టి పూడికతీత పనులను అధికారికంగా ప్రారంభించారు. చెరువులో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాల మట్టం కూడా మెరుగుపడనుంది. వర్షాకాలంలో ఎక్కువ నీరు నిల్వ ఉండి రైతులకు సాగునీటి సమస్య తగ్గే అవకాశం ఉందని గ్రామస్థులు భావిస్తున్నారు.
ఈ సందర్భంగా ఇంచార్జ్ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ రైతులకు సాగునీటి సమస్య తగ్గించేందుకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చెరువు పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని అన్నారు. భూగర్భ జలాల స్థాయి పెరగడం ద్వారా తాగునీటి సమస్య కూడా తగ్గే అవకాశముందని పేర్కొంటూ, గ్రామ ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు పార్నందుల మహేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు.

**-సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.**





**బయ్యారం/,మే 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం జగ్గుతండా పంచాయతీలో కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులకీ నోచుకోని బోర్లను రిపేర్ చేపించిన పంచాయతీ పాలకవర్గం. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ బొల్లి జయంతి మాట్లాడుతూ..గ్రామంలో అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడటమే మా బాధ్యత అన్నారు. కొన్ని సమస్యల వల్ల మిషన్ భగీరథ నీరు నిలిచిపోవడంతో,వాటి మీదనే ఆధారపడుతున్న ప్రజలు ఇబ్బందులను గ్రహించిన పాలకవర్గం ప్రత్యామ్నాయంగా వీధులలో నిరుపయోగంగా ఉన్న బోర్లను బాగు చేపించి ప్రజలకు నీటి సాదుపాయం కల్పించారు. దీనిలో భాగంగా బంజర తండాలోని పాత బోరికి మోటర్ ఫీట్ చేయించమన్నారు. దీనికి సంబంధించి బంజర తండా గ్రామస్తులు మాట్లాడుతూ..ఎటువంటి నీటి సదుపాయం లేని మాకు బోరుకు మోటార్ ఫిట్ చేయించడం ఎంతో సంతోషమని అన్నారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి,గ్రామస్తులు బండారి నాగబాబు,మోదుగుల పద్మ, సమ్మయ్య,ఇంజుమామ్,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి సహకారంతో మాణిక్యాపూర్‌లో బోరుబావి





**భీమదేవరపల్లి/మే18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బోరు వేయించడంతో గ్రామ ప్రజలు, మండల బీజేపీ నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాణిక్యాపూర్ సర్పంచ్ ముదసాని మమత సదానందం, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే జిల్లా నాయకులు మాచర్ల కుమారస్వామి, మండల అధ్యక్షులు శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు తీగల రాజు, రామారాపు భద్రయ్య, ఐలయ్య, అర్జున్, గణేష్, తిరుపతి, అఖిల్, రాకేష్, కార్తీక్, గ్రామ బూత్ అధ్యక్షులు మరియు బీజేపీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు

# వేలేరులో 5కే రన్, 2కే వాక్‌థాన్




**వేలేరు/, మే 18: (జర్నలిస్టు వార్త):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్పోర్ట్స్ అండ్ యూత్ శాఖ ఆధ్వర్యంలో వేలేరు మండల కేంద్రంలో సోమవారం 5కే రన్ మారథాన్, 2కే వాక్‌థాన్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈవో చంద్ర మొగిళి, ఎంపీవో అఫ్జల్, ఏపీవో విజయ, ఏఈ హౌసింగ్ అభిలాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక శాఖల ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేలేరు మండల కేంద్రంలో 5కే రన్, 2కే వాక్‌థాన్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, పౌష్టికాహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జీపీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రవిప్రసాద్, రాజేశ్వర్, ప్రదీప్, కరుణాకర్, వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్యతండాలో ఘనంగా బొడ్రాయి వేడుకలు.



**బయ్యారం/,మే 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని బాల్యతండాలో బొడ్రాయి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో బొడ్రాయి వద్ద పూజలు చేశారు. ఈ వేడుకల్లో బిఆర్ఎస్ మండల నాయకురాలు అజ్మీరా కల్పనా సునీల్ నాయక్ కుటుంబసభ్యులకు కలిసి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. ఈ ఉత్సవాల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారికి బోనం,పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ వేడుకలు గ్రామంలో అందరినీ ఆకట్టుకున్నాయి.

# ఈఏపీసెట్‌లో నల్లబెల్లి విద్యార్థి ప్రతిభ

## : రీత్విక్‌కు ఘన సన్మానం



**వర్ధన్నపేట/మే 18(జర్నలిస్ వార్త):** టీజీ-ఈఏపీసెట్ ఫలితాలలో వర్ధన్నపేట మండల పరిధిలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన డిల్లీ రీత్విక్ రాష్ట్రస్థాయిలో 400వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. డిల్లీ దేవేందర్ రావు, నీత దంపతుల కుమారుడైన రీత్విక్ సాధించిన ఈ విజయంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీత్విక్‌ను స్థానిక ముఖ్య నేతలు, గ్రామస్థులు శాలువాతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీత్విక్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులు చదివి, నల్లబెల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జ గోపాల్ రావు, మాజీ ఎంపిటిసి దుగ్యాల జ్యోతిమాధవ రావు, మాజీ సర్పంచ్ ముత్యం సంపత్, మాజీ ఉప సర్పంచ్ బిర్రు చంద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు సురేష్, యమునా చారీ, వెంకటేశ్వరరావు, కనుకయ్య, కుమారస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థి దశలో కష్టమే విజయానికి పునాది

## కావేరి విత్తన సంస్థ చైర్మన్ గుండవరపు వెంకట భాస్కర్ రావు





**భీమదేవరపల్లి / మే18 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ జి.ఎస్.ఎస్.ఆర్. ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కావేరి విత్తన సంస్థ చైర్మన్ గుండవరపు వెంకట భాస్కర్ రావు పూలబొకేలు, శాలువాలు, నగదు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ప్రతినెల లక్షలాది రూపాయలు వెచ్చించి ఈ పాఠశాలలో అన్ని వసతులతో విద్య అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదవాలని సూచించారు. అలాగే విద్యార్థులను భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుని వారిని ప్రోత్సహించారు. అనంతరం పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన బొంతల సృజన, జక్కుల శివకుమార్, మెరుగు సంహిత, గడ్డం తేజశ్రీ, గడిపి ఉత్తేజిత, భూక్య శ్రీలత, జనగం సుధీష్ణ, బైరి అక్షయ, అంజన్నలను సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డోరి రమేష్, సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, మండల విద్యాధికారి ఎం. సునీత, ఉపసర్పంచ్ బోడిగే శ్రీనివాస్, కావేరి సూపర్వైజర్ రాంకిషన్ రాజు, ఉపాధ్యాయులు ఎ. శ్రీనివాస్ రెడ్డి, కామరపు శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం.!

**-ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. -అమలు చేయని యెడల పోరాటాలకు సిద్ధం కావాలి.**

**-సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్.**

**-ప్రజా హామీలు అమలు చేయాలి.. లేకపోతే ఉద్యమాలు తప్పవు. --కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అశోకన్నా తీవ్ర విమర్శలు.**

**బయ్యారం/,మే 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశం సోమవారం నిర్వహించారు.జిల్లా కార్యదర్శులు సనప పోమ్మయ్య,బానోత్ ఉక్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.హామీలు అమలు చేయకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.బంగారం ధరలను పెంచే ప్రభుత్వాలకు రైతు పంటలపై మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని అన్నారు.దేశంలో పెట్రోలు,డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని,కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు.కార్మిక చట్టాల అమలు కోసం ప్రజలు మరోసారి పోరాటాలకు సిద్ధం కావాలని




పిలుపునిచ్చారు.దేశ ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ,ప్రజా సంపదను కాపాడుకోవడానికి ఎర్రజెండా పార్టీల నాయకత్వంలో ప్రతిఘటన ఉద్యమాలు అవసరమని పేర్కొన్నారు.సీతారాం ప్రాజెక్టు నీటిని రోల్లపాడు చెరువు నుంచి ఇల్లందు, బయ్యారం చెరువులకు మళ్లించి వేలాది మంది రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి గిరిజన,ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మైనర్ బాలిక వేధింపుల కేసులో నిందితులపై ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని అశోక్



విమర్శించారు.పేదలపై ఒకలా, పెద్దలపై మరోలా చట్టం అమలు చేయడం సరికాదని అన్నారు.పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీశాఖ అధికారుల దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత,పిడిఎస్ యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, ఏఐకేఎంఎస్ నాయకులు మట్టపల్లి అంజయ్య,గుగులోతు రామచంద్రు, అరుణోదయ నాయకులు బుజ్జయ్య, నారాయణ,పాపయ్య,పివైఎల్, ఐఎఫ్టియు నాయకులు,కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కొత్తపేట గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

# బయ్యారంలో నిర్వహించిన 2కే రన్ లో పాల్గొన్న ఎంపిడిఓ,సర్పంచ్.




**బయ్యారం/,మే 18.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఎంపిడిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది.ఈ పరుగును ఎంపీడీవో దీపిక జెండా ఊపి ప్రారంభించారు.2కే రన్ ఎంపిడిఓ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ పరుగులో యువత, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..యువతే దేశానికి ఆదర్శం అని, యువత శారీరక దృఢత్వంతో పాటు సామాజిక చైతన్యం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,ఎస్ఐ ప్రశాంత్ బాబు,ఎంఈఓ లక్ష్మణ్ రావు,డాక్టర్ విజయ్ కుమార్,ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది,ఫారెస్ట్ సిబ్బంది,పోలీస్ సిబ్బంది,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా డా.గజ్జెల రాములు





**వర్ధన్నపేట/మే 18(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ కాంగ్రెస్ అధిష్టానం తాజాగాప్రకటించిన పీసీసీ కమిటీల్లో నల్లబెల్లిగ్రామ ముద్దుబిడ్డ, పేద ప్రజల ఆశాజ్యోతిడాక్టర్ గజ్జెల రాములుకు సముచిత స్థానందక్కింది. ఆయనను రాజ్యాంగ పరిరక్షణ కమిటీలో సభ్యులుగా నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నల్లబెల్లిగ్రామస్తులు, వర్ధన్నపేట నియోజకవర్గకాంగ్రెస్ శ్రేణులు ఆయనకు హృదయపూర్వకశుభాకాంక్షలు తెలియజేశారు. రాములు విద్యార్థి దశలోనే పి. శివశంకర్ సారథ్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీయూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగాపనిచేసి, ప్రజా సేవలో నిరంతరంకొనసాగుతున్నారు. ఆయన భవిష్యత్తులోమరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి,నియోజకవర్గ ప్రజలకు మరింత సేవచేయాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,వార్డు సభ్యులు మరుపట్ల ప్రశాంత్, తాటికాయల దిలీప్, భాస్కర్, గోపాల్,యాకంబ్రం, నాగరాజు, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆలోచనా విధానమే అధికార ముద్ర

## : కార్పొరేట్ కొలువుల నుంచి స్వయం సమృద్ధి వైపు!




సమకాలీన సమాజంలో విద్య, ఉద్యోగం, వ్యాపారం. ఈ మూడు రంగాల మధ్య ఉన్న అంతరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఆధునిక విద్యా వ్యవస్థ లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తోంది. అయితే, అందులో అత్యధికులు కేవలం ఉద్యోగులు గా మారడానికే పరిమితమవుతున్నారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా, ఎన్ని డిగ్రీలు సాధించినా అంతిమంగా ఒకరి కింద చేతులు కట్టుకుని పని చేయాల్సి రావడం నేటి ప్రైవేట్ ఉద్యోగుల చేదు నిజం. చదువు ఉంది, ప్రతిభ ఉంది, శ్రమించే తత్వం ఉంది. కానీ పైచేయి మాత్రం ఎప్పుడూ కార్పొరేట్ శక్తులదే, వ్యాపార మార్కెట్‌ను శాసించే ఉన్నత వర్గాలదే అవుతోంది. ఈ అసమానతలకు కారణం కేవలం పెట్టుబడి మాత్రమే కాదు, అంతకుమించిన ఆలోచనా దృక్పథం, మార్కెట్ వ్యూహం. బిజినెస్ మార్కెట్‌ను గమనిస్తే, అక్కడ ఎప్పుడూ ఆర్థికంగా, సామాజికంగా బలపడిన ఉన్నత వర్గాల ఆధిపత్యమే కనిపిస్తుంది. వారి వద్ద పెట్టుబడితో పాటు రిస్క్ (నష్టం) భరించే సామర్థ్యం ఉంటుంది. సామాన్య, మధ్యతరగతి యువత మాత్రం ఉద్యోగ భద్రత అనే చట్రంలో ఇరుక్కుపోతున్నారు. నెల తిరిగితే వచ్చే జీతంపైనే ఆధారపడేలా వారి ఆలోచనలను విద్యా వ్యవస్థ, కుటుంబ పరిస్థితులు పరిమితం చేస్తున్నాయి. అందుకే, ప్రతిభావంతులైన యువత సైతం ప్రైవేట్ కంపెనీలలో రాత్రనక, పగలనక శ్రమిస్తూ, వేరొకరి సామ్రాజ్యాన్ని నిర్మించడానికి తమ జీవితాలను ధారపోస్తున్నారు. యజమానుల లాభాల కోసం ఉద్యోగులు తమ సృజనాత్మకతను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి నేడు నెలకొంది.

అయితే, ఈ శృంఖలాలను తెంచుకోవడానికి ఉన్న ఏకైక మార్గంఉన్నత ఆలోచనలు! కేవలం శ్రామికుడిగా మిగిలిపోవాలా, లేదా ఒక సామ్రాజ్యానికి అధినేత కావాలా అనేది వ్యక్తిగత ఆలోచనా శైలిపైనే ఆధారపడి ఉంటుంది. ఉన్నతమైన ఆలోచనలు, భిన్నమైన వ్యూహాలు ఉన్నప్పుడే ఒక వ్యక్తి ఉన్నత స్థాయిలో నిలబడగలడు. నేడు ప్రపంచాన్ని శాసిస్తున్న ఎందరో దిగ్గజాలు ఒకప్పుడు సామాన్యులుగా, చిన్న ఆలోచనతో ప్రస్థానాన్ని ప్రారంభించినవారే. పెట్టుబడి కంటే కూడా ఆలోచన' అనేది వ్యాపార ప్రపంచంలో అతిపెద్ద ఆయుధం. మార్కెట్ అవసరాలను గుర్తించి, కొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే సంకల్పం ఉన్నప్పుడు, సాధారణ వర్గాల నుంచి కూడా అద్భుతమైన పారిశ్రామికవేత్తలు పుట్టుకొస్తారు.

ప్రస్తుత తరం యువత ఉద్యోగం పొందే స్థాయి నుంచి 'ఉద్యోగాలు ఇచ్చే స్థాయి'కి ఎదగాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రైవేట్ కొలువుల సేవలోనే జీవితాన్ని ముగించకుండా, స్వయం సమృద్ధి వైపు అడుగులు వేయాలి. ప్రభుత్వాలు కూడా స్టార్టప్‌లకు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు అందించాలి. వ్యాపార మార్కెట్లో ఉన్నత వర్గాల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టాలంటే, మధ్యతరగతి మేధోశక్తి వ్యాపార రంగం వైపు మళ్లక తప్పదు. సృజనాత్మకతకు ధైర్యం తోడైతే, ఉన్నత ఆలోచనలు కచ్చితంగా ఉన్నత స్థానంలో నిలబెడతాయి. అప్పుడే సమాజంలో నిజమైన ఆర్థిక సమానత్వం, స్వయం ఉపాధి సాధ్యమవుతాయి.



జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్